క్లుప్తంగా

ఘనంగా రోటి పండుగ



వంటలు చేస్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని విట్టాపూర్‌లో రోటి పండుగ శనివారం ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని కోరుతూ హనుమాన్ ఆలయంలో రైతులు పూజలు చేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గల్లాపురం లక్ష్మీరమేశ్, ఉప సర్పంచ్ నవీన్ రెడ్డి, వీడీసీ చైర్మన్ అశోక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్, కౌన్సిలర్‌కు సన్మానం



సుపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్

ఖానాపూర్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం సుపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్‌తోపాటు పలువురు కౌన్సిలర్, కోఆప్షన్ మెంబర్లను సన్మానించారు. చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్, కౌన్సిలర్లు కావలి సంతోశ్, పరిమి లత, కోఆప్షన్లు బండారి కిశోర్, మౌలానా సుల్తానా, పానగంటి రాజుబాయి, కమిషనర్ మనోహర్ తదితరులను సత్కరించారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయంతోపాటు పలు వాహనాలను పూలతో అలంకరించి పూజలు చేశారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నీలగిరి సాగుతో అధిక లాభాలు



అవగాహన కల్పిస్తున్న ఏఈవో రాజ్‌కుమార్

పెంబి: సాగునీటి వసతి లేని రెవెన్యూ, అటవీ హక్కు పత్రాలు కలిగిన భూముల్లో వర్షాధారంగా నీలగిరి సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని పేపర్‌మిల్లు మేనేజర్ సంతోష్, ఏఈవో రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంకంపోచంపాడ్ గ్రామంలో సిర్పూర్ పేపర్ మిల్లు, ఫారెస్ట్ అధికారులతో కలిసి ఆగ్రో ఫారెస్ట్రీ తోటల పెంపకంపై శనివారం అవగాహన కల్పించారు. నీలగిరి సాగుకు అవసరమైన మొక్కలు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. హక్కుపత్రాలు కలిగిన రైతులు నీలగిరితోపాటు సుబాబుల్ సాగు చేసుకోవచ్చని, రవాణా సమయంలో ఎలాంటి అభ్యంతరాలు ఉండవని ఎఫ్ఎస్ రవీందర్ తెలిపారు. నీలభాయి, పేపర్ మిల్లు అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్, ఫీల్డ్ ఆఫీసర్లు రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

కాలువ పెండింగ్ పనులు పూర్తిచేయాలి

ముథోల్: పూర్వ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్, నేటి కాళేశ్వరం కాలువ పెండింగ్ పనులు సత్వరమే పూర్తిచేసి నియోజకవర్గానికి సాగునీరందించాలని టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పలు గ్రామాల రైతులతో కలిసి చించాల, తరోడా శివారు ప్రాంతంలో కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు ప్రారంభించి 11 ఏళ్లు గడుస్తున్నా నేటికి కాలువ పనులు పూర్తికాలేదన్నారు. 50 వేల ఎకరాలకు సాగునీరందిస్తామని తెలంగాణ అంతట కాళేశ్వరం నీరు పారుతాయని చెప్పినా సీఎం కేసీఆర్ వీటి పనులను పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే పనులు పూర్తిచేసి రైతులకు సాగునీరందించాలని డిమాండ్ చేశారు. నాయకులు భూమన్న, రాజేశ్వర్, రైతులు సాయినాథ్, అంజయ్య, గంగాధర్, పోశెట్టి, తర్నదీప్, మనోహర్, శంకర్, అర్జున్ ఉన్నారు.

2కే రన్ విజయవంతం చేయండి

భైంసాటౌన్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 2కే రన్‌ను విజయవంతం చేయాలని పట్టణ సీఐ ఎల్.శ్రీను ఒక ప్రకటనలో కోరారు. సోమవారం ఉదయం 6 గంటలకు స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి రన్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పట్టణవాసులు, యువత పాల్గొనాలని కోరారు.

చరిత్ర తోవలో నిర్మల్ గమనం

- చారిత్రక శోధనలో జిల్లా వసులు
- బృంద చర్చ, పత్రాల సమర్పణ
- భావితరాలకు అందించడమే లక్ష్యం..
- ఇటీవల హైదరాబాద్‌లో చరిత్రకారుల సదస్సు



హైదరాబాద్‌లో జరిగిన చరిత్రకారుల సదస్సులో జిల్లావాసులు (ఫైల్)



పురస్కారం స్వీకరిస్తున్న ధోండి శ్రీనివాస్



మురళి అందుకున్న పురస్కారం, ప్రశంసపత్రం

నిర్మల్‌ఖిల్లా: చరిత్ర.. మన జీవన విధానానికి అద్దం పడుతుంది. పుట్టుక, జీవనం, అభివృద్ధిని తెలియజేస్తుంది. అలాంటి చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను అప్పటి శిల్పాలు, కట్టడాలు, ఆనవాళ్లను ఎప్పటికప్పుడు వీడియో రూపంలో, పరిశోధన రాతప్రతుల రూపంలో నిక్షిప్తం చేస్తూ భావితరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నారు జిల్లాకు చెందిన పరిశోధకులు. 8వ శతాబ్దం నుంచి ప్రస్తుత కాలం వరకు మరుగునపడిన ఎన్నో చారిత్రక కట్టడాలు, ఆనవాళ్లు వెలుగులోకి తీస్తున్నారు. ఇవే అంశాలపై జూన్ 4న తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన చరిత్రకారుల సదస్సులో బృంద చర్చలు, వివరణలు, పరిశోధన పత్రాల సమర్పించారు. ఇందులో నిర్మల్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కటకం మురళి, చరిత్ర పరిశోధకుడు దొండి శ్రీనివాస్ పాల్గొన్నారు. పరిశోధన పత్రాలు, వీడియోల రూపంలో నిక్షిప్తం చేసిన చారిత్రక అంశాలను వివరించారు. అప్పటి శిల్పాలు, కట్టడాలు, కోటగోడలు, ఖిల్లాల వివరాలను సమావేశంలో వివరించారు.

చారిత్రక పరిశోధన కోసం..

కటకం మురళి వృత్తిరీత్యా చరిత్ర సబ్జెక్టులో భైంసా డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చారిత్రక పురాతన అంశాలపై మక్కువను కలిగి ఉంటారు. విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే విరామ సమయంలో జిల్లాకు చెందిన నిర్మల్, భైంసా, ముధోల్, ఖానాపూర్ తదితర ప్రాంతాల్లోని చారిత్రక అంశాలు, గోండులు, జీవన విధానం, ఖిల్లాగుట్టలు, పురాతన శిల్పాలు, చారిత్రక కోటలు తదితర అంశాలపై పరిశోధన చేసి రాతపూర్వకంగా నిక్షిప్తం చేస్తున్నారు. క్రీ.శ.870 నుంచి 1751 వరకు ఉమ్మడి జిల్లా జీవన విధానం, పరిపాలకులు, చారిత్రక ప్రాంతాలపై అధ్యయనం చేశారు. ఇదే అంశంపై మురళి పీహెచ్‌డీ కూడా పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా చరిత్రను వెలుగులోకి తేవాలనే లక్ష్యంతో పరిశోధనలు చేస్తున్నారు.

పరిశోధనాశైలి మెండు..

చారిత్రకంగా నిర్మల్ జిల్లాకు ఎంతో పేరుంది. నేటి యువతరానికి ఆ చారిత్రక అంశాలపై పూర్తిగా అవగాహన లేదు. జిల్లాకేంద్రంలోని శ్యామ్‌గఢ్, బత్తీస్‌గఢ్, గజ్‌గఢ్, గొలుసుకట్టు చెరువులు, కందకాలు, రక్షణ వ్యవస్థ తదితర అంశాలపై కొన్నేళ్లుగా దొండి శ్రీనివాస్ పరిశోధనలు చేస్తున్నాడు. వీటిని వీడియో రూపంలో సేకరించి తన యూట్యూబ్ చానెల్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పటికే పలు అంశాలను యూట్యూబ్ ద్వారా షేర్ చేస్తూ నిర్మల్ చరిత్రను వెలుగులోకి తెస్తున్నాడు. నిర్మల్ చరిత్రను కొత్త తరానికి తెలియజేయాలనే సంకల్పంతోనే పరిశోధనలు చేస్తున్నారు. ఫలితాలను ‘లైఫ్ ఇన్ విలేజ్’ యూట్యూబ్ చానెల్ ద్వారా అందరికీ అందుబాటులో ఉంచుతున్నారు.

రేపటి నుంచి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి, ఆలయ చైర్మన్

నిర్మల్‌ఖిల్లా/నిర్మల్‌టౌన్: ఈనెల 12 నుంచి గండి రామన్న దత్తసాయి ఆలయంలో నిర్వహించే సాయిబాబా వార్షికోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి కోరారు. మంత్రి ఐకేరెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో వార్షికోత్సవ వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయంలో షిర్డీ తరహాలో నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. చింతకుంటవాడలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి సాయిదివ్య రథంలో సాయిబాబా ఊరేగింపు ఉంటుందన్నారు. ఆలయం వరకు ఈ శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. మంత్రి ఐకేరెడ్డి విజయలక్ష్మి దంపతులు ఈ యాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. 13న ఆలయంలో పూజలతోపాటు హోమం, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంబటి మహేందర్, ముడారపు సోమేశ్, అనంతుల లక్ష్మణ్, కొక్కుల లక్ష్మణ్, ఉప్పుల నందు, రేఖ, ప్రియాంక, రుక్మవ్వ, శశికళ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుట్ట ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలో పాల్గొన్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: నిర్మల్ గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక రేణుకా మాత పుట్ట ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు రెండోరోజు శనివారం ఘనంగా జరిగాయి. గీత పారిశ్రామిక సహకార సంఘం నుంచి అక్కాపూర్ గ్రామం వరకు గౌడ కులస్తులు పెద్దఎత్తున బయల్దేరి వెళ్లారు. మహిళలు మంగళహారతులతో వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు. వేద పండితులు ఆనందశర్మ, గుడి రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. మంత్రి ఐకేరెడ్డి హాజరై పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. కాగా, గౌడ శెట్టి బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఘటం ఊరేగింపులో మంత్రి నృత్యం చేశారు. వ్యాపారవేత్త మురళీధర్‌రెడ్డి, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ సుజాత పోశెట్టి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్, సింగాపూర్ గ్రామాల్లో శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ పర్యటించారు. పల్లెపల్లెకు రేఖక్క కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నాయకులు పుప్పాల శంకర్, గజేందర్, రామకృష్ణ, లక్ష్మణ్, గంగాధర్, మల్లేశ్, నిమ్యానాయక్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



కుభీర్: క్షీరాభిషేకం చేస్తున్న పుప్పాల పిరాజి, తదితరులు



లక్ష్మణచాంద: క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

లక్ష్మణచాంద/కుభీర్: దివ్యాంగులకు ఇస్తున్న పెన్షన్‌ను మరో రూ.1100లకు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ మంచిర్యాలలో ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ మేరకు శనివారం లక్ష్మణచాందలో మండల దివ్యాంగుల ఆధ్వర్యంలో, కుభీర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. వికలాంగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల పిరాజి, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మండల అధ్యక్షుడు అనిల్ తోపాటు గంగన్న, జమాల్, సాయన్న, రవీందర్ పాల్గొన్నారు.

ఆహ్వానించి అవమానిస్తారా?



తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని దివ్యగార్డెన్‌లో శనివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ అధికారులు, ప్రజాప్రజానిధులకు ఆహ్వానం అందించారు. ఇందులో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలకు ఆహ్వానం అందలేదు. అయితే వీరిలో కొందరు వచ్చినా వారిని స్టేజ్ పైకి పిలవలేదు. తనను మాట్లాడించకపోవడంతో దస్తూరాబాద్ ఎంపీపీ కిషన్ జెడ్పీ సీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇలా పిలిచి అవమానించడం మీకు ఎంతవరకు సమంజసమని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ముందే వాగ్వాదానికి దిగాడు. ఎమ్మెల్యే కల్పించుకొని ఎంపీపీకి సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. – సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

లోకేశ్వరం:ముథోల్ మండలం బ్రహ్మణ్‌గాం గ్రామవాసి గంగాధర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు జెడ్ల రాజారాం కోరారు. ఈ మేరకు భైంసా మండలం దేగాంలోని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నివాసంలో ఆయనకు శనివారం వినతిపత్రం అందజేశారు. రాజారాం మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 9న ప్రారంభించిన రెండోవిడతలో పంపిణీ చేసే గొర్రెలు నాణ్యతగా లేవన్నారు. గంగాధర్ ఇటీవల గొర్రెలు తీసుకువచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయినాథ్, నాయకులు లింగన్న, పోతన్న ఉన్నారు.

హామీలు మరిచి దశాబ్ది ఉత్సవాలా ?

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ జిల్లా కార్యదర్శి రాజన్న



మాట్లాడుతున్న రాజన్న

సారంగపూర్: సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలు మరిచి.. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం ఏమిటని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ జిల్లా కార్యదర్శి రాజన్న ప్రశ్నించారు. మండలంలోని మలక్‌చించోలి ఎక్స్‌రోడ్డు వద్ద గల బీడీ ఫ్యాక్టరీ ఎదుట ఏడవ మహాసభల సందర్భంగా కూలీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 9ఏళ్లలో ఇప్పటివరకు ఇచ్చిన ఏహామీని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఇప్పటికీ అనేకచోట్ల కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఓవైపు రైతులు కన్నీరు కారుస్తుంటే ఉత్సవాలు చేసి ఏం సాధిస్తారని దుయ్యబట్టారు. ఇచ్చిన ప్రతి హామీని వెంటనే నెరవేర్చాలని లేకపోతే సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి లక్ష్మి, బీడీ కార్మికులు ముత్తవ్వ, రమేశ్, మశ్చేందర్, సాయన్న, శోభన్, లక్ష్మి, రమణ తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా

పేద కుటుంబాన్ని ఆదుకోవాలి

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గాలివాన కారణంగా ఇంటి పైకప్పు లేచిపోయి తీవ్రంగా నష్టపోయిన నిరుపేద కంచి రాధ కుటుంబాన్ని ఆదుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోశ్ డిమాండ్ చేశారు. శనివారం కాలనీలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అధికారులు సర్వే చేసి, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తానూరు: మండలకేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులో భాగంగా ఆదివారం సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ జాదవ్ ప్రదీప్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

భైంసా కురుమ సంఘం ఎన్నిక

లోకేశ్వరం: భైంసా మండలంలోని దేగాం గ్రామంలో భైంసా కురుమ సంఘం కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టేకుల బాబు, ఉపాధ్యక్షుడిగా కోనేరు గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా అశోక్, సంయుక్త కార్యదర్శిగా గంగాధర్, సహాయ కార్యదర్శిగా దశరథ్, కోశాధికారిగా పోతన్న, సలహాదారుగా పోతన్న, కార్యనిర్వాహక సభ్యులుగా విఠల్, భోజారం, గంగాధర్, మల్లేశ్ ఎన్నికయ్యారు.

డెమో క్లాసులకు హాజరుకావాలి

లోకేశ్వరం: మండలంలోని రాజూర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నర్సరీ నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లిష్ బోధించే వీపీలు ఆదివారం ఉదయం 9 గంటలకు డెమో క్లాసులకు హాజరుకావాలని ఎంఈవో చంద్రకాంత్, సర్పంచ్ ముత్తగౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సన్మానం

లక్ష్మణచాంద: గత 37 ఏళ్లుగా బీపీఎంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన రమేశ్‌ను పంచాయతీ, వీడీసీ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. మండల కేంద్రంలో రమేశ్ దంపతులను సర్పంచ్ ముత్యంరెడ్డి సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. ఉప సర్పంచ్ శ్రీనివాస్, వీడీసీ సభ్యులు రవి కిరణ్, శ్రీనివాస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తపాలాశాఖ కార్యాలయంలో ఆధార్ సేవలు

భైంసాటౌన్: తపాలా శాఖ కార్యాలయంలో అందిస్తున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని భైంసా తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ సుశ్మిత బెనర్జీ అన్నారు. పట్టణంలోని తపాలా శాఖ కార్యాలయంలో శనివారం ఆధార్ సేవాకేంద్రాన్ని ప్రారంభించారు. నూతన ఆధార్, ఆధార్ అప్‌డేట్, బయోమెట్రిక్, డెమోగ్రఫిక్ అప్‌డేట్, పేరు, పుట్టినతేదీ, తదితర ఆధార్ సంబంధ సేవలు వినియోగించుకోవచ్చని అన్నారు. కార్యాలయ వేళల్లో సంప్రదించాలని సూచించారు.

ప్రమాదకరంగా వంతెనలు

- కాలువల్లో పడిపోతున్న పశువులు, వాహనాలు
- భయాందోళనలో గ్రామాల ప్రజలు
- మరమ్మతు చేపట్టాలని వేడుకోలు



లక్ష్మీనగర్, బోరింగ్‌తండాలకు వెళ్లేదారిలో రక్షణగోడలు కూలిపోయి ప్రమాదకరంగా మారిన వంతెన



దుర్గానగర్ సమీపంలో వంతెనపై నుంచి కాలువలో పడిపోయిన ఆటో

సారంగపూర్: మండలంలోని దుర్గానగర్, జామ్, మహవీర్‌తండా సమీపంలోని వంతెనలు ప్రమాదకరంగా మారాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు వంతెనలు కోతకు గురికావడంతో ప్రమాదకరంగా మారి పశువులను పొట్టనపెట్టుకుంటున్నాయి. దీంతో అటు వాహనదారులతోపాటు పశుపోషకులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదస్థాయి తీవ్రంగా ఉన్నా అధికారులు గాని, పాలకులు గాని పట్టించుకోకపోవడంతో ప్రజలు భయం గుప్పిట్లో అదే వంతెనలపై నుంచి రాకపోకలు సాగించడంతోపాటు పశువులను దాటించే పరిస్థితి ఏర్పడింది.

మండలంలోని దుర్గానగర్ సమీపంలో హైలెవల్ కాలువపై నిర్మించిన వంతెన గట్టు రెండు వైపులా గతేడాది కురిసిన భారీ వర్షాలకు కోతకు గురయ్యాయి. అయితే ఉదయం, సాయంత్రం ఇదే వంతెనపై నుంచి వందల పశువులు వంతెన దాటి అడవికి చేరుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో గేదెలు వంతెన దాటే క్రమంలో కోతకు గురైన గట్ల వెంబడి నడిచి కాలువలో పడిపోయిన దాఖలాలున్నాయి. జామ్ గ్రామంలో రైతు సాయన్నకు చెందిన గేదె వంతెనపై నుంచి కాలువలో పడిపోయింది. రెండుకాళ్లు విరిగిపోగా పలువురి రైతుల పశువులు సైతం కాలువలో పడ్డాయి. తాజాగా మూడురోజుల క్రితం ఓ ఆటో వంతెనపై నుంచి వెళ్తుండగా కోతకు గురైన గట్టు విరిగిపడి ఆటో కాలువలో పల్టీ కొడుతూ పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్ అప్రమత్తతతో ప్రాణాలు దక్కించుకున్నాడు. ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నా సంబంధిత కాలువ కాంట్రాక్టు సంస్థ ఏమాత్రం పట్టించుకోకపోడం శోచనీయం. ఇదే వంతెన మీదుగా దుర్గానగర్, హనుమాన్‌తండా, సేవానగర్ తండావాసులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన వద్ద రెండువైపులా గట్టు కోతకు గురికావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకు వస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు.

మహవీర్‌తండా సమీపంలో..

మహవీర్‌తండాకు వెళ్లేదారిపై మహవీర్‌తండా సమీపంలో వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు నాలుగువైపులా కోతకు గురికావడంతో మూలమలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. తండాకు చెందిన కిషన్ అనే రైతు గతేడాది క్రితం తన పొలం నుంచి పశుగ్రాసం తరలించే క్రమంలో ఎద్దుల బండి పశుగ్రాసంతో సహా కాలువలో పడిపోయింది. గమనించిన సమీప రైతులు వెంటనే ఎద్దులను రక్షించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. పలుమార్లు ద్విచక్రవాహనదారులు పడి గాయాలపాలయ్యారు. లక్ష్మీనగర్, బోరింగ్ తండాలకు వెళ్లేదారిపై జామ్ సమీపంలో వంతెనపై రక్షణగోడలు కూలిపోయి ప్రమాదకరంగా మారింది. రాత్రిసమయంలో గమనించకపోతే పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. పశువులు నిత్యం ఇదే వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. పలుమార్లు పశువులు కాలువలో పడిపోయిన దాఖలాలున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి వెంటనే వంతెనల వద్ద మరమ్మతు పనులు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేపడుతాం

గతంలో హైలెవెల్ కాలువ పనులను సుషీ ఇన్‌ఫ్రా కంపెనీ చేపట్టింది. ప్రస్తుతం ఆ సంస్థ తప్పుకోవడంతో ప్రస్తుతం బృందా కంపెనీ పనులు నిర్వహిస్తోంది. కాలువ పనులు కొనసాగుతున్నాయి. సంస్థ సిబ్బందితో మాట్లాడి దుర్గానగర్, మహవీర్‌తండా సమీపంలో మరమ్మతు చేయిస్తాం.


– మిరాజుద్దీన్, ఏఈ, మేజర్ ఇరిగేషన్

ఇబ్బంది లేకుండా చూస్తాం

ప్రమాదాలు జరిగిన విషయం మాకు తెలియరాలేదు. వెంటనే నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి మరమ్మతు జరిపించేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం.

– సరోజ, ఎంపీడీవో, సారంగపూర్

కొనసాగుతున్న పూజలు



హోమంలో పాల్గొన్న దంపతులు

కుంటాల: మండలంలోని లింబా (కే) గ్రామంలో హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం బబ్రు మహారాజ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావు పటేల్ పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఎంపీపీ గజ్జారాం యాదవ్, సర్పంచ్ ఆనందరావు పటేల్, ఆత్మ చైర్మన్ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ గిరీశ్‌కుమార్, ఉప సర్పంచ్ ముత్యంరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గోనె గజ్జారాం, గ్రామపెద్దలు ఆది రాజన్న, తానాజీ, రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.